ఎస్బీఐని మించిన ఎల్ఐసీ

అత్యంత విలువైన పీఎస్‌యూగా బీమా దిగ్గజం

న్యూఢిల్లీ, జనవరి 17: బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) మార్కెట్ విలువ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) విలువను తాజాగా అధిగమించింది. దీంతో అత్యంత విలువైన ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసీ తన స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంది. బుధవారం మార్కెట్ ట్రేడింగ్ తొలిదశలో ఎల్ఐసీ షేరు రూ. 900 స్థాయిని మించడంతో మార్కెట్ విలువ రూ.5.64 లక్షల కోట్లకు చేరగా, అదే సమయంలో రూ.635 ధరతో షేరు ట్రేడయినపుడు ఎస్బీఐ విలువ రూ.5.63 లక్షల కోట్లుగా ఉన్నది. తదుపరి మార్కెట్ ముగింపులో ఈ రెండు షేర్లూ క్షీణించి రూ.887, రూ. 526 స్థాయిల వద్ద నిలిచాయి. ముగింపు సమయానికి ఎల్ఐసీ విలువ రూ.5.60 లక్షల కోట్లుకాగా, ఎస్బీఐ విలువ రూ. 5.58 లక్షల కోట్లు.

ఐపీవో ధరకు చేరడం ఇదే తొలిసారి

ఎల్ఐసీ అత్యంత విలువైన పీఎస్‌యూ అయినప్పటికీ, ఐపీవోలో మదుపుచేసిన ఇన్వెస్టర్లకు ఇప్పటివరకూ ఏమాత్రం రాబడిని ఇవ్వలేకపోయింది. పబ్లిక్ ఆఫర్‌లో కేంద్ర ప్రభుత్వం షేర్లను విక్రయించిన కొద్ది నెలలకే ఇది రూ.530 స్థాయికి పతనమై ఇన్వెస్టర్ల సంపదను కరిగించివేసింది. అయితే ఒకటిన్నర సంవత్సరానికి ఎట్టకేలకు దాదాపు ఐపీవో ధరకు ఎల్ఐసీ షేరు చేరగలిగింది. బుధవారం ఎల్ఐసీ షేరు ఇంట్రాడేలో రూ. 917 స్థాయికి పెరిగిన అనంతరం రూ. 887 వద్ద ముగిసింది. ఎల్ఐసీలో ప్రస్తుతం ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉన్నది. 2022 మే నెలలో షేరుకు రూ. 949 ధరతో ఆఫర్ జారీ చేయగా, చిన్న ఇన్వెస్టర్లకు రూ.45 డిస్కౌంట్‌తో షేర్లను కేటాయించారు. రూ.875 ధరతో ఇది లిస్టయ్యింది.

అతలాకుతలం

ఒక్కరోజే సెన్సెక్స్ 1,628 పాయింట్లు డౌన్ • గడిచిన ఏడాదిన్నరలో ఇదే గరిష్ఠం

460 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ • బ్యాంకింగ్, చమురు సూచీల్లో అమ్మకాల ఒత్తిడి

8 శాతానికిపైగా క్షీణించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ విలువ

రూ.4.6 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

పడుతూ.. లేస్తూ సాగుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లలో భారీ అలజడి. మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణకు పెద్దపీట వేయడంతో సూచీలు ఒక్కసారిగా పడిపోయాయి. సెన్సెక్స్ ఏడాదిన్నర కాలంలో అత్యంత భీకర నష్టాన్ని చవిచూసింది. దీంతో మార్కెట్ సంపద ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో కరిగిపోయింది.

నష్టాలకు ప్రధాన కారణాలు

- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతల్లో ఆలస్యమన్న అంచనాలు
- మెప్పించని కార్పొరేట్ల త్రైమాసిక ఫలితాలు
- లాభాల స్వీకరణలో మదుపరులు
- బ్యాంకింగ్, మెటల్, చమురు రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు

- *అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన షేర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకే.*
- *రూ.1,07,851.24 కోట్లు దిగజారి రూ.11,66,888.98 కోట్లకు పడిపోయిన సంస్థ మార్కెట్ విలువ.*
- *కొటక్ మహీంద్రా, యాక్సిస్, ఐసీఐసీఐ, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి.*
- *బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.09 శాతం, స్మాల్ క్యాప్ 0.90 శాతం చొప్పున పతనం.*

ముంబై, జనవరి 17: దేశీయ స్టాక్ మార్కెట్లలో బుధవారం పెద్ద కుదుపే చోటుచేసుకున్నది. ఉదయం ఆరంభం నుంచే మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణకు పెద్దపీట వేయడంతో సూచీలు భారీ నష్టాలకు లోనయ్యాయి. సమయం గడుస్తున్నకొద్దీ బ్యాంకింగ్, మెటల్, చమురు రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగిపోయింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,628.01 పాయింట్లు లేదా 2.23 శాతం క్షీణించి 71,500.76 వద్ద ముగిసింది. గడిచిన ఏడాదిన్నరకుపైగా కాలంలో ఒక్కరోజే ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. 2022 జూన్ 13న చివరిసారిగా ఈ స్థాయిలో సెన్సెక్స్ నష్టాలను చూసింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే. ఇక ఒకానొక దశలో 1,699.47 పాయింట్లు దిగజారడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 460.35 పాయింట్లు లేదా 2.09 శాతం పతనమై 21,571.95 వద్ద నిలిచింది.

హెచ్‌డీఎఫ్‌సీ దెబ్బ

దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మంగళవారం ప్రకటించిన త్రైమాసిక ఆర్థిక ఫలితాలే.. ఇంతటి భారీ నష్టాలకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగా లేవని, అందుకే మదుపర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పాటు మొత్తం బ్యాంకింగ్ షేర్ల అమ్మకానికి తెగబడ్డారని వారు చెప్తున్నారు. క్యూ3లో బ్యాంక్ నికర లాభం రూ.17,258 కోట్లుగా ఉన్నది. గతంతో పోల్చితే 2.65 శాతం పెరిగినా.. ఇన్వెస్టర్లను నిరాశపర్చిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల విలువ ఏకంగా 8 శాతానికిపైగా క్షీణించింది. సెన్సెక్స్‌లో గరిష్ఠంగా 8.46 శాతం దిగజారి రూ.1,536.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే 9 శాతం పడిపోయింది. ఇక నిఫ్టీలోనూ 8.15 శాతం నష్టపోయి రూ.1,542.15 వద్ద ముగిసింది. ఈ క్రమంలో ఈ ఒక్కరోజే కంపెనీ మార్కెట్ విలువ లక్ష కోట్ల రూపాయలకుపైగా పడిపోయింది. రంగాలవారీగా చూస్తే.. బ్యాంకింగ్ అత్యధికంగా 4.02 శాతం దిగజారింది. ఆర్థిక సేవలు 3.76 శాతం, మెటల్ 2.86 శాతం, కమాడిటీస్ 2.31 శాతం, టెలీ కమ్యూనికేషన్ 1.94 శాతం, రియల్టీ 1.47 శాతం చొప్పున క్షీణించాయి.

రూ.6 లక్షల కోట్లు మాయం

మంగళ, బుధవారాల్లో స్టాక్ మార్కెట్ నష్టాలు.. దాదాపు రూ.6 లక్షల కోట్ల మదుపరుల సంపదను ఆవిరి చేసేశాయి. బుధవారం ఒక్కరోజే రూ.4,59,327.64 కోట్లు హరించుకుపోగా, అంతకుముందు రోజు నష్టంతో చూస్తే ఇది రూ.5,73,576.83 కోట్లకు చేరింది. దీంతో ప్రస్తుతం బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ రూ.3,70,35,933.18 కోట్లకు పరిమితమైంది. వడ్డీరేట్ల తగ్గింపుపై అమెరికా ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ చేసిన వ్యాఖ్యలు అటు యూఎస్ పదేండ్ల బాండ్ల ఈల్డ్స్‌ను పెంచగా, ఇటు డాలర్ ఇండెక్స్‌ను ఎగదోసింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గిస్తేనే.. దేశంలో ఆర్బీఐ కూడా వడ్డీ కోతల దిశగా కదులుతుంది. అక్కడ ఆలస్యమైతే ఇక్కడా అంతే. దీంతో బ్యాంకింగ్ షేర్లతోపాటు స్టీల్, రియల్టీ ఇతరత్రా ఇంట్రెస్ట్ రేట్ రిలేటెడ్ షేర్లూ కుప్పకూలాయంటున్నారు.

వడ్డీరేట్ల కోతల ఆశలపై నీళ్లు చల్లిన ఫెడ్ గవర్నర్

వడ్డీరేట్ల కోతల ఆశలపై ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నీళ్లు చల్లింది. వడ్డీరేట్లు ఇప్పుడప్పుడే తగ్గబోవని ఫెడ్ రిజర్వ్ గవర్నర్ క్రిస్టోఫర్ వాలర్ అన్నారు. ఓ సదస్సులో మాట్లాడుతూ అమెరికా ఆర్థిక వ్యవస్థ బాగుందని, ద్రవ్యోల్బణం కూడా దిగివస్తున్నదన్న ఆయన.. ఈ నేపథ్యంలో వడ్డీరేట్లను తొందరగా తగ్గించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఇప్పట్లో వడ్డీరేట్ల కోతలుండవనే సంకేతాలు ఇచ్చినట్టైంది. నిజానికి ఈ ఏడాది మార్చి నుంచి ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించడం మొదలుపెడుతుందని బలమైన అంచనాలున్నాయి. కానీ వాలర్ వ్యాఖ్యలతో ఈ అంచనాలకు గండి పడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు ఒక్కసారిగా నష్టాలకు లోనయ్యాయి.

మార్కెట్లోకి టాటా మోటార్స్ పంచ్ ఈవీ ప్రారంభ ధర రూ.10.99 లక్షలు

సింగిల్ చార్జింగ్‌తో 421 కిలోమీటర్లు

న్యూఢిల్లీ, జనవరి 17: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్ సరికొత్త ఈవీని పరిచయం చేసింది. దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పంచ్ ఈవీ వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు రూ.10.99 లక్షల నుంచి రూ.14.49 లక్షల లోపు లభించనున్నది. రెండు బ్యాటరీ ప్యాక్ కలిగిన ఈ పంచ్..25 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 315 కిలోమీటర్లు, 35 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 421 కిలోమీటర్ల దూరం ప్రయాణించనున్నది. స్మార్ట్ డిజిటల్, ఫోన్ చార్జింగ్, 366 లీటర్ల బూట్‌స్పేస్, వాయిస్ అసిస్టెంట్స్ రూఫ్‌టాప్ వంటి ఫీచర్స్‌తో రూపొందించింది. కేవలం 9.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు నాలుగు రంగుల్లో లభించనున్నది.

విస్తరణ దిశగా హాస్పిటల్స్

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ భారీగా విస్తరిస్తాయని, ఇందుకు వచ్చే 4-5 ఏండ్లలో రూ.32,500 కోట్లు పెట్టుబడి చేస్తాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తున్నది. ఈ పెట్టుబడితో ప్రస్తుత పడకల సామర్థ్యానికి మరో 30,000 బెడ్స్‌ను జతచేస్తాయన్నది. హెల్త్‌కేర్ సర్వీసులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రుల అక్యుపెన్సీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 65 శాతం ఉంటుందని, కొవిడ్ పాండమిక్ తర్వాత మెడికల్ టూరిజం పునరుద్ధరణతో వ్యవస్థాగత ప్రైవేటు హాస్పిటల్స్ మార్కెట్ వాటాను పెంచుకుంటున్నాయని ఇక్రా వైస్ ప్రెసిడెంట్ మైత్రి మాచెర్ల వివరించారు. పడకల విస్తరణలో మెట్రో నగరాలు ముందు ఉంటాయని, వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర కేంద్రాల్లో గణనీయమైన స్థాయిలో హాస్పిటల్ బెడ్స్ పెరుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. ఇన్సూరెన్స్ సదుపాయం వ్యాప్తిచెందడం, జీవనశైలి వ్యాధులు, మెడికల్ టూరిజం వృద్ధి తదితర అంశాలతో సర్జరీలకు డిమాండ్ పెరుగుతున్నదని, దీంతో హాస్పిటల్ పరిశ్రమలోని వ్యవస్థాగత కంపెనీలు ప్రయోజనం పొందుతాయన్నారు.

నోవా అగ్రిటెక్ ఐపీవో

హైదరాబాద్, జనవరి 17: రాష్ట్రానికి చెందిన వ్యవసాయ ఉత్పత్తుల తయారీ సంస్థ నోవా అగ్రిటెక్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. ఈ నెల 22 నుంచి 24 వరకు మూడు రోజుల వాటా షేర్లను విక్రయిస్తున్నది. రూ.144 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి షేర్ల ధరల శ్రేణిని రూ.39-41 మధ్యలో నిర్ణయించింది.

అదానీ చేతికి ఐఏఎన్ఎస్

న్యూఢిల్లీ, జనవరి 17: న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను పూర్తిగా అదానీ గ్రూపు చేతిలోకి వెళ్లిపోయింది. గత నెలలో 50.50 శాతం వాటాను కొనుగోలు చేసిన అదానీ గ్రూపు..తాజాగా ఈ వాటాను 76 శాతానికి పెంచుకున్నది. ఈ వాటాను పెంచుకోవడానికి అదానీ గ్రూపు రూ.5 కోట్ల మేర నిధులు వెచ్చించింది.